క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని కోక్యాతండా, నేలపట్ల తదితర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొనగా విషయాన్ని గ్రామస్తులు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు బోర్లు వేయించి మోటార్లు ఏర్పాటు చేశారు. ఈమేరకు ఆయా గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కేఎంసీ ఏఓగా శివలింగం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అకౌంట్స్ ఆఫీసర్‌గా శివలింగం బాధ్యతలు చేపట్టారు. అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్‌ను రెవెన్యూ విభాగంలో ఆర్‌ఐగా నియమిస్తూ, ఏఓ బాధ్యతల నుంచి కమిషనర్ తొలగించారు. అకౌంట్స్ విభాగంలో జేఏఓగా విధులు నిర్వర్తిస్తున్న శివలింగంకు పూర్తిస్థాయి ఏఓ బాధ్యతలను అప్పగించారు. కాగా, ఏఓగా పని చేస్తున్న సమయాన ప్రసాద్‌పై అనేక ఆరోపణలు రావడంతో కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

దివ్యాంగులకు కృత్రిమ పాదాలు అందజేత

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గట్టయ్య సెంటర్‌లో ఉన్న రోటరీ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌లో శనివారం 25 మంది దివ్యాంగులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన కృత్రిమ పాదాలను అందించారు. అమెరికాలో స్థిరపడిన దేశరాజు రవి, శైలజలు ఎస్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ద్వారా అందించిన ఆర్థిక సాయంతో రోటరీ క్లబ్ దివ్యాంగులకు ఉచితంగా పాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.వెంకటరెడ్డి, బోనాల లామకృష్ణ, బాబూరావు, రంగారావు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపీటీఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 28వ తేదీన జరగనున్న ప్రైవేట్ టీచర్స్ సంకల్ప సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలోని పలు పాఠశాలల్లో ప్రచారాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌహాన్, సుధాకర్, జబ్బార్, రమణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శవపేటిక వితరణ

కామేపల్లి: మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గుండా వెంకట్‌రెడ్డి రూ.70వేలు విలువైన శవపేటికను (ఫ్రీజర్) మద్దులపల్లి గ్రామపంచాయతీకి శనివారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, బాధావత్ శ్రీనివాస్, సామ మోహన్‌రెడ్డి, కాత్రాల రాంబాబు, ఎంపీటీసీ గఃబునాక్, రామ్ చందర్ నాయక్, గోపిరెడ్డి, అడప ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌లో హనుమాన్ చాలీసా పారాయణం

ఖమ్మంగాంధీచౌక్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని గాంధీచౌక్ సెంటర్‌లో శనివారం హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించారు. కనమర్లపూడి శ్రీనివాస్–రజని బృందంచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని పారాయణం చేసిన భక్తులకు ఉత్సవ కమిటీ తీర్థప్రసాదాలు అందించారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ కిరాణా జాగీరు మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు వేములపల్లి నరేష్, కార్యదర్శి వజ్రపు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఆధ్వర్యాన నీటి సరఫరా



నీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య ఆధ్వర్యాన గ్రామస్తులకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్న నేపథ్యాన ఉచితంగా సరఫరా చేయాలని ఆయన నిర్ణయించారు. ఈమేరకు దండా సీతమ్మ–గోపయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం తాగునీటి సరఫరా ప్రారంభించగా, ప్రతిరోజు ఆరు నుంచి ఏడు ట్యాంకర్లను రెండు నెలల పాటు అందిస్తామని పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

మూగ రోదన..!






నేలకొండపల్లిలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

నిరుపయోగంగా నీటితొట్లు

- ఎండ తీవ్రతకు మూగజీవాలు విలవిల
- చుక్కనీరు లేక అల్లాడుతున్న వైనం
- రూ.25వేల చొప్పున నిర్మాణం
- మరమ్మతులు చేయకపోవడంతో శిథిలావస్థకు..
- నిధులన్నీ నీటి తొట్లపాలు



నేలకొండపల్లి: రోజు రోజుకు పెరుగుతున్న భానుడు ప్రతాపానికి భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో ఎక్కడా చూసిన చుక్కనీరు లేకపోవడంతో మూగజీవాలు ఆశగా నీటితొట్ల వైపు చూస్తున్నాయి. కానీ వాటిని వినియోగంలోకి తీసుకురావటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వేసవి కరువు పరిస్థితి కారణంగా చెరువులు, కుంటలు, వాగులు, బావులతో పాటు చేతి పంపులు కూడా ఇంకిపోతుండడంతో మేతకు వెళ్లిన మూగజీవాలు గుక్కెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాయి. ఒక వైపు ప్రజలు, మరో వైపు మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన పశువుల నీటి తొట్లు నీటి వసతి లేక నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాల కొన్ని చోట్ల మురుగు నీటితోనే దప్పిక తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

రూ.లక్షల నిధులు వెచ్చించి..

గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు పశువులకు నీటి వసతి కల్పించాల్సి ఉంది. కానీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. అయితే గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఒక్కో నీటి తొట్టికి రూ.25 వేల చొప్పున నీటి తొట్లను నిర్మించింది. ఇలా కొన్ని రూ.లక్షల నిధులు వెచ్చించి వందలాది నిర్మాణాలు చేపట్టగా.. కొద్దిరోజుల వరకే నీటిని సరఫరా చేసి నింపారు. ఆ తరువాత అధికారుల పర్యవేక్షణ కరువై నిర్వహణ లోపంతో అవి శిథిలావస్థకు చేరాయి.

మరమ్మతులతో మేలు..

రూ.లక్ష్యలు వెచ్చించి నిర్మించిన నీటితొట్లకు చిన్న, చిన్న మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవటంతో నిరుపయోగంగా మారాయి. కాగా, వీటిలో ఎక్కువ భాగం పగుళ్లు బారినపడగా.. మరికొన్ని ఉపయోగంలో లేకుండా పోయాయి. అధికారులు చొరవ తీసుకుని తొట్లకు నీటి వసతి కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరాయి..



గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు శిథిలావస్థకు చేరాయి. వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి మూగజీవాలకు నీరు అందించాలి. చుక్కనీరు దొరక్క అవి అల్లాడుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– కాశిబోయిన అయోధ్య, రైతు, సింగారెడ్డిపాలెం

వినియోగంలోకి తీసుకురావాలి..



గతంలో ఉన్న తొట్లు వినియోగంలోకి తీసుకురావటంతో పాటు కొత్తగా ప్రతీ పంచాయతీలో రెండు నిర్మిస్తే చాలా ఉపయోగం. నీటితొట్ల నిండా తాగునీటిని ఏర్పాటు చేసే దిశగా అధికారులు చొరవ చూపాలి. పశువులకు జీవం పోసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి.

– తీగ రమణయ్య, రైతు, రాయగూడెం

చర్యలు తీసుకుంటాం..



కొన్ని గ్రామాల్లో నీటితొట్లు నిరుపయోగంగా ఉన్నట్లు తెలిసింది. వాటికి మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. మండలంలో ఉన్న నీటితొట్ల వివరాలను సేకరించి వాటిని పునరుద్ధరించి పశువుల దాహార్తి తీరుస్తాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

తప్పుడు ఆరోపణలు సరికాదు..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ఎన్నికల సమయాన దాడి చేయడానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుట్ర పన్నారని చేస్తున్న ఆరోపణలు సరికాదని మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇష్టానుసారంగా హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేని కాంగ్రెస్ ఇలాంటి వాటిని తెరపైకి తీసుకొచ్చి ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. రెచ్చగొట్టే రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. ఇటువంటి రాజకీయాలను బీఆర్‌ఎస్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మక్బూల్, దండా జ్యోతిరెడ్డి, మాజీ సుడా చైర్మన్ విజయ్‌కుమార్, తాజుద్దీన్, బొమ్మెర రామ్మూర్తి, నరేందర్, మేకల సుగణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

దాడికి కుట్ర హేయమైన చర్య

ఖమ్మం అర్బన్/రఘునాథపాలెం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అసెంబ్లీ ఎన్నికల సమయాన దాడికి కుట్ర చేయటం హేయమైన చర్య అని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం 5వ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏలూరి శ్రీనివాసరావు, పల్లెబోయిన చంద్రం, లకావత్ సైదులు, యల్లంపల్లి హన్మంతరావు, రఘునాథపాలెం సమావేశంలో భుక్యా బాలాజీనాయక్, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, ఎంపీటీసీ యరగర్ల హన్మంతరావులు మాట్లాడారు. నాటి ఓ పోలీస్ అధికారితో పాటు కుట్రలో ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సమావేశంలో నాయకులు బొందిలి నాగేంద్రసింగ్, తమ్మినేని వెంకటేశ్వరరావు, చల్లా రామకృష్ణ, ఆకారపు కృష్ణవేణి, తమ్మిన్ని నాగేశ్వరరావు, మారం కరుణాకర్ రెడ్డి, కోటేరు నర్సిరెడ్డి, గుడిపుడి రామారావు, బాతుల సుధాకర్, వెంకటనర్సయ్య, తక్కెళ్లపాటి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ టికెట్లు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఐపీఎల్ క్రికెట్ టికెట్లు బ్లాక్‌లో అమ్మే జట్ల యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీవైఎల్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు రాకేష్, బషీరుద్దిన్, రామకృష్ణలు డిమాండ్ చేశారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యువజన సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లో ఏ మ్యాచ్ జరిగినా టిక్కెట్‌లను బ్లాక్‌లో అమ్ముకోవడం కార్పొరేట్ వ్యాపారంగా మారిందని, ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రమేష్, రవీందర్, కూరపాటి శ్రీనివాస్, వెంకట్, రమణ తదితరులు పాల్గొన్నారు.

షాడో ఎంఈఓ పాలన నుంచి విముక్తి కల్పించాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని బోనకల్ మండలంలో ఉపాధ్యాయులపై షాడో ఎంఈఓ పాలన కొనసాగుతుందని, దీని నుంచి విముక్తి కలిగించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ కోరారు. శనివారం డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బోనకల్ మండలం ఎంఈఓ మెదక్ జిల్లాకు బదిలీ కావటంతో నాటి నుంచి ఆ బాధ్యతలు ఎవరిరూ చేపట్టలేదు. దీంతో షాడో ఎంఈఓ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణమే ఎంఈఓను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంగళరావు, శ్యామ్‌సుందర్, యాకుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేందర్

ఖమ్మంవ్యవసాయం: బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరముందని ఆల్ ఇండియా కో–ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి పాశం నాగేందర్ తెలిపారు. ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శనివారం ఖమ్మంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగేందర్ మాట్లాడుతూ బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు పోరాడాలని తెలిపారు. అలాగే, కార్మికులు, ఉద్యోగులు హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గాదె లక్ష్మీనారాయణ, సింగు నర్సింహారావు, తలారి రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూసుమంచి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం కూసుమంచి టౌన్‌తో పాటు తురకగూడెం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పరిచయ కార్యక్రమం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో విద్యార్థులకు ఈ నెల 21(నేడు) ఉదయం 11 గంటలకు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ కార్యకలాపాలతో పాటు విద్యార్థులకు తరగతి, ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై తెలియజేస్తామని పేర్కొన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్, డిప్లొమా విద్యార్థులు ఆన్‌లైన్‌లో అసైన్‌మెంట్స్ పంపాల్సిన విధానాన్ని వివరించనున్నట్లు చెప్పారు.

ప్రత్యేకాధికారుల నియామకం

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి: మండలంలోని నాలుగు పంచాయతీలకు నెల రోజుల నుంచి ప్రత్యేకాధికారి బాధ్యతలు తీసుకోకపోవటంతో 'బాధ్యతలు స్వీకరించని ప్రత్యేకాధికారి'అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సీరియస్ అయ్యారు. ఈమేరకు నాలుగు గ్రామ పంచాయతీలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ఆచార్లగూడెం, ఆరెగూడెం పంచాయతీలను మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, కోనాయిగూడెం, కోరట్లగూడెం పంచాయతీలకు ఎంపీడీఓ ఎం.యర్రయ్యలకు బాధ్యతలు అప్పగించి వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. దీంతో తాగునీటి సమస్య, పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్ వేతనాల సమస్యకు పరిష్కారం కానుంది.

మతోన్మాద దాడిని ఖండించాలి

నేలకొండపల్లి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై మతోన్మాద గుండాలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ఈమేరకు నేలకొండపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న సంఘం నాయకులపై దాడి చేయడం సిగ్గుచేటని, వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరీష్, వెంకట్, శంకర్, అనిల్, మౌలానా, ప్రవీణ్, రవి, శ్రావణి, రమ్య, భవ్య, రజనీ, రమ్యశ్రీ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు

కామేపల్లి: రైతులు భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలని ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో భూసార పరీక్షకు మట్టి సేకరణ, భూసార పరీక్షల ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించడం ద్వారా ఏ పంటకు ఏ ఎరువులు, ఏ మోతాదులో వేస్తే అధిక దిగుబడి వస్తుందో రైతులకు వివరించారు. పూజారి పక్షుల ఆధారంగా వచ్చే ఫలితాల ఆధారంగా భూమిలో ఏ పోషకాలు తక్కువగా ఉంటే ఆ ఎరువులను మాత్రమే వినియోగించుకొని భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ తారాదేవి, ఏఈఓ శ్రీకన్య, జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

పాఠశాలల పనుల్లో వేగం పెంచాలి

నేలకొండపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలలో జరిగే పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య ఆదేశించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, గ్రామ సమాఖ్యలతో చర్చించి పనుల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు. పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, విద్యుత్, టాయిలెట్లకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



చెరువుమాధారం పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

పెద్దతండాలో మౌలిక వసతులు కల్పించాలి

ఖమ్మంరూరల్: మండలంలోని పెద్దతండా పంచాయతీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఐ పార్టీ నాయకులు శనివారం ప్రత్యేకాధికారి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తండాలో డ్రైయినేజీని మెరుగుపరిచి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, ప్రియదర్శిని కళాశాల వరకు సీసీ రోడ్డు నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తండాలో స్మశానవాటిక లేక ఇబ్బంది పడుతున్నారని, నిలిచిపోయిన సీసీ రహదారులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ గడ్డా నాయక్, దేవానాయక్, బాలాజీ, సంధ్యనాయక్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు బిహార్ వాసి అప్పగింత



అహ్మద్‌ను అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తికి వైద్యం చేయించి కోలుకున్నాక కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తెలిపారు. మూడేళ్ల కిందట కామేపల్లిలో 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి స్థానికులపై దాడి చేస్తుండగా పోలీసులకు తెలిపారు. పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం శ్రీనివాసరావు సదరు వ్యక్తిని మమత ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. ఆ తర్వాత ఆశ్రమంలో చేర్చుకోగా కోలుకున్న ఆయన తన పేరు మీర్జాదబ్రేజ్ అహ్మద్ బేగ్ అని, తమది బిహార్ రాష్ట్రం దర్భంగా జిల్లా అని చెప్పడంతో అక్కడి పోలీసుల సాయంతో ఆరా తీశా రు. ఈ మేరకు అహ్మద్ బేగ్ భార్య, కుమారుడు ఖమ్మం చేరుకుని స్వస్థలానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసరాల అందజేత

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెం, నేలకొండపల్లి గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదల కుటుంబాలకు ఎస్‌టీఆర్ సేవా సమితి ఆధ్వర్యాన నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో గురిజాల వెంకటేశ్వరరావు, మార్తి శ్రీకాంత్, సత్యాల గోపి, పసుపులేటి సతీష్, అబ్దుల్, పి.శ్రీకాంత్, పార్థు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్



మంత్రి తుమ్మలతో వెంకటేశ్వర్లు, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

పలువురికి పరామర్శ..

ఖమ్మం వన్‌టౌన్: కామేపల్లి మండలం తాళ్లగూడెంకు చెందిన కాంగ్రెస్ నాయకులు నల్లమోతు రవికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఆస్పత్రిలో ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, నాయకులు చావా నారాయణ,మలీదు జగన్, మందడపు బ్రహ్మారెడ్డి, మందడపు మనోహర్‌రావు, పోట్ల వీరేందర్, చావా నారాయణరావు, కొప్పెర ఉపేందర్, అబ్దుల్ రషీద్, కమతం రామకృష్ణ, పుచ్చకాయల వీరభద్రం, గజ్జెల వెంకన్న, బొమ్మిడి శ్రీనివాసరావు, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, వీరేందర్, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నర్సింహారెడ్డి ఉన్నారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో సరఫరా అవుతున్న మంచినీటిలో మట్టి, దుర్వాసన వస్తుందని, దీంతో ప్రజలు వాంతులు, విరోచనాలు అవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం అన్నారు. శనివారం స్థానిక ఎన్‌ఎస్‌టీ రోడ్డులో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజు విడిచి రోజు మంచి నీటిని సరఫరా చేయడం లేదని, నాలుగు రోజుల కోసారి వచ్చే నీళ్లు కూడా మట్టితో వస్తుండడంతో ప్రజలు క్యాన్ల ద్వారా తాగునీరు కొనుక్కొంటున్నారని తెలిపారు. ఫిల్టర్ బెడ్స్, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి సరిపడా స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఎండీ రెహమాన్, రమణ, ఉపేందరమ్మ, దుర్గానాథ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నళ్లకు అంతరాయం

ఖమ్మంక్రైం: నగరంలో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో శనివారం అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్ల వద్ద వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. నగరంలో కిన్నెర పాయింట్, జెడ్పీసెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్, చర్చి కాంపౌండ్, ఇందిరానగర్, శ్రీశ్రీ సర్కిల్, బైపాస్ రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్, ఆర్‌టీఓ కార్యాలయ సెంటర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనిచేయలేదు. దీంతో కొన్ని ప్రాంతాల వరకు పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయగా.. విద్యుత్ అంతరాయం తొలగిపోవటంతో ట్రాఫిక్ సిగ్నల్స్ పునరుద్ధరించారు. కాగా, వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని పోలీసులు చెబుతున్నారు.



ఆర్‌టీఓ కార్యాలయం, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సిగ్నల్స్

పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టిన బీఆర్‌ఎస్

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించింది. శనివారం ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతలు పోస్టుకార్డులు రాశారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, పింఛన్లు రూ.4 వేలు, వరికి క్వింటాకు రూ.500 బోనస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోస్టుకార్డులు రాశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, నాయకుడు బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్‌కార్డులతో బీఆర్‌ఎస్ నేతలు